నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 1 జూన్ 2024 | SANGAREDDY

చారిత్రక చిహ్నాలను వివాదాస్పదం చేయొద్దు

సిద్దిపేట అర్బన్, మే 31: రాజకీయ ఆలోచనలు, కారణాలు ఏవైనా కావొచ్చు.. ఏమైనా ఉండొచ్చు.. తెలంగాణ పేరెత్తగానే స్ఫురించే చారిత్రక చిహ్నాలను తొలిగించడం చారిత్రక తప్పిదమే అవుతుంది. చారిత్రక నేపథ్యం ఉన్న చిహ్నాల్ని రాజకీయ ఆలోచనలు, కారణాలతో వివాదాస్పదం చేయడం సరైంది కాదు. సాధించుకున్న స్వరాష్ట్రంలో పరిష్కరించుకోవాల్సిన సమస్యలు ఎన్నో ఉండగా.. చిహ్నాల విషయంలో రాద్ధాంతం చేస్తూ ప్రభుత్వం సమస్యలను పక్కన పెట్టడం భావ్యం కాదు. ఎవరికీ మంచిది కాదు..

ఆత్మగౌరవ పతాకానెత్తుకొని....

తెలంగాణ ప్రాంతం రకరకాలుగా వివక్షతలకు గురైనప్పుడు ఆత్మగౌరవ పతాకానెత్తుకొని నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఉద్యమించింది. భాష లేదంటే.. భాషాపద కోశాల్ని వెతుకున్నది. చరిత్ర లేదంటే.. పరిశోధనలు చేసి చారిత్రక వైభవాల్ని లిఖించుకున్నది. సాహిత్యకారుల్ని, ఆచార సంప్రదాయాల్ని అవమానిస్తే తెలంగాణ వ్యాప్తంగా సాహితీవేత్తలు, కళాకారులు పాటల పుట్టలై జనగర్జన చేశారు. ఆత్మగౌరవం కోసం సబ్బండ వర్గాలు ఒక్కటై సాధించుకున్న తెలంగాణలో చిహ్నాల రాద్ధాంతం ఎందుకు..? చారిత్రక చిహ్నాల విషయానికి వస్తే.. రాచరిక ఆధిపత్యం, అహంకారం, దర్పం లాంటి లక్షణాలు ఏమాత్రం లేవు. కాకతీయ రాజులు సైతం తెలంగాణపై ఇతరుల ఆధిపత్యాన్ని సహించలేదు. అందుకే ఢిల్లీ సుల్తానులు రాజ్యకాంక్షతో ఓరుగల్లుపై దండెత్తి వచ్చినప్పుడు అసమాన పోరాట పటిమతో ప్రతాపరుద్రుడు ఎదుర్కొన్నాడు. మహిళా పాలిస్తుందా..? అని తిరుగుబాట్లు చేసినప్పుడు రాణీ రుద్రమ పోరాట సామర్థ్యాన్ని ప్రదర్శించింది. కాకతీయులు ప్రజల విశ్వాసాలను, క్షేమాన్ని గుర్తించి ఆలయాలు, గొలుసుకట్టు చెరువుల నిర్మాణాలు చేపట్టారు. కాకతీయుల ఆధిపత్యాన్ని సహించని సమ్మక్క, సారలమ్మల పోరాటం చారిత్రాత్మకం. కాకతీయుల శిల్పకళ చాలా గొప్పది. రామప్ప గుడిని ఇటీవల యునెస్కో వాళ్లు వారసత్వ కట్టడంగా ప్రకటించి ప్రపంచానికి ఆ ఘనతను చాటారు. కాకతీయుల పేరుతో కాకతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయబడింది. ఈ విశ్వవిద్యాలయానికి స్వాగత ద్వారాలు కళాతోరణాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణకు ముఖద్వారంగా ఉన్న కళాతోరణం చిహ్నాన్ని తెలంగాణ స్వాగత తోరణంగా భావించి తొలిగించకుండా చూడాలి. తెలంగాణ పేరెత్తగానే హైదరాబాద్.. హైదరాబాద్ పేరెత్తగానే భారతీయులకు, బయట ప్రపంచానికి చార్మినార్ స్ఫురించడం సహజం. చార్మినార్ రాచరిక చిహ్నం కాదు. రాజరిక ఠీవి, దర్పానికి గుర్తు కాదు. హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి ప్రబలి వేలాది మంది చనిపోయారు. నాటి పాలకుడైన కులీకుతుబ్ షాహి చలించి ఆ మహమ్మారి సృష్టించిన విపత్తుకు స్మృతి చిహ్నంగా చార్మినార్‌ను నిర్మింపజేశాడు. నాటి నుంచి వందల ఏండ్లుగా ఇక్కడి ప్రజల ఐకమత్యానికి ప్రతీకగా నిలిచింది.

ప్రజాభిప్రాయాల్ని గౌరవించాలి...

చారిత్రక పరిణామంలో, గమనంలో, చరిత్రలో అనేక మలుపు, దశలు ఉంటాయి. వాటిలో కొన్ని దశల్లో జరిగిన ఘటనలు, వాటి తాలూకా గుర్తులు నిలబడిపోతాయి. అలా చరిత్రలో ప్రత్యేక సంఘటనలకు గుర్తుగా కాకతీయ కళాతోరణం, చార్మినార్ నిలిచిపోయాయి. అలా నిలిచిపోయిన చిహ్నాల జోలికి పోకుండా ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజాస్వామిక పాలన అందిస్తూ ప్రజల అభిప్రాయాల్ని గౌరవించకపోతే చారిత్రక తప్పిదం చేసినట్లే అవుతుంది. తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షతలపై తిరగబడి ఆత్మగౌరవ పతాకం చేబూని సబ్బండ వర్గాలు ఒకటై పోరాటం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 1969లో తొలిదశ, మలిదశల్లో చేసిన ఉద్యమాల్లో వందలాది మంది యువకులు, విద్యార్థులు ఆత్మ బలిదానాలతో ఉద్యమాన్ని ఉడుకెత్తించారు. ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా త్యాగాలు, బలిదానాలు చేసిన కుటుంబాల్ని ఆదుకోవడం ఉద్యమాల్లో పాల్గొన్న యువకుల్ని, విద్యార్థులు, ఉద్యమకారుల్ని గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరమున్నది. అమరవీరుల స్మృతి చిహ్నాన్ని సైతం గౌరవించుకోవాల్సిన అవసరమున్నది. త్యాగాల పునాదుల మీద సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాస్వామిక పరిపాలన అందించాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై, ప్రభుత్వంపై ఉంది. ప్రజాభిప్రాయాల్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

– నర్ర భగవాన్‌రెడ్డి
(చారిత్రక పరిశోధక విద్యార్థి, తెలంగాణ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడు)

అంతా అవినీతిమయం

చిన్నస్థాయి ఉద్యోగి నుంచి తహసీల్దార్ వరకు పైసా లేనిది పనికాదు..

- అవినీతికి కేరాఫ్ తహసీల్ కార్యాలయాలు
- ముడుపులు అందజేస్తే .. చకచకా పనులు
- ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు
- తహసీల్ కార్యాలయానికి వెళ్లాలంటేనే జంకుతున్న సామాన్యులు
- దళారులు, పైరవీకారులను కలిశాకే పనులు
- పనికో రేటు..లేదంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే
- నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించినా.. చేతులు తడపనిదే పని కావడం లేదంటున్న బాధితులు
- లేకపోతే ఏదో రకంగా కొర్రీలు పెట్టి పని ఆపేస్తున్నారని ఆరోపణ
- వేలల్లో జీతాలు తీసుకునే ఉద్యోగులు ఇలా బరితెగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సిద్దిపేట. మే 31(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతున్నది. ఇటీవల ఏసీబీ దాడుల్లో పలువురు ఉద్యోగులు పట్టుబడిన సందర్భాలూ ఉన్నాయి. ఆర్డీవో కార్యాలయాల్లో కూడా దాడులు జరుగుతున్నాయి. ప్రధానమైన రెవెన్యూ శాఖలో అవినీతి మరీ మితిమీరిందని, అవినీతికి కేరాఫ్‌గా తహసీల్ కార్యాలయాలు మారాయని రైతులు ఆరోపిస్తున్నారు. ముడుపులు అందజేస్తే ఏదైనా సాధ్యం అన్న తరహాలో పనులు జరుగుతాయంటున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో జరిగిన సంఘటనలను చెప్పుకోవచ్చు. ఆయా మండల కేంద్రాల్లో ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకొని మరీ రెవెన్యూ అధికారులు దందాలు నడిపిస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. కార్యాలయాల్లో పైరవీకారులు చెప్పిందే వేదం. భూముల విషయంలో స్థానికంగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు కీలకంగా మారారు. సామాన్యులను పీడించుకుతింటున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో రెవెన్యూ అధికారుల అవినీతి రోజురోజుకూ మితిమీరుతున్నది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రెవెన్యూ అధికారులు ఇటీవల కాలంలో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సామాన్యులు, రైతులు తహసీల్ కార్యాలయానికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. దళారులను, పైరవీకారులను కలిసాకే తహసీల్ కార్యాలయాల్లోకి అడుగుపెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పనికో రేటు నిర్ణయించి దళారులు చెప్పిన విధంగా ఇస్తేనే పనులు సాఫీగా జరుగుతున్నాయి. లేదంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే. ఇటీవల సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట గ్రామ శివారులోని సర్వే నెంబర్ 844లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు పోయిన భూమిని సైతం ఇతరులకు స్థానిక తహసీల్దార్ 10 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై గ్రామస్తుల ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో వచ్చి విచారణ చేశారు. కానీ ఎలాంటి చర్యలు లేవు. ఇక ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ చేయాలంటే ముందుగా నాలా కన్వర్షన్ చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా చాలా చోట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

పైసా లేనిది పని కాదు ..

ఏ పని కావాలన్నా పైరవీకారులు చెప్పాలి. పైసా లేనిది పని కాదు.. చిన్నస్థాయి ఉద్యోగి నుంచి తహసీల్దార్ వరకు అంతా వసూళ్లే... కొన్ని మండలాల్లో ప్రైవేట్ వ్యక్తులదే పెత్తనం.. ఆఫీసుకు సంబంధం లేని వారిని ఏర్పాటు చేసుకొని మామూళ్లు తీసుకొని వారికి కావాల్సిన ఫైల్‌ను చక్కబెడుతున్నారు. ప్రతి చిన్న విషయానికీ ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. స్లాట్ బుక్ చేస్తే కూడా డబ్బులు తీసుకోనిది రిజిస్ట్రేషన్ చేయడం లేదన్న ఆరోపణలు జిల్లాలో బలంగా ఉన్నాయి. ల్యాండ్ కన్వర్షన్ కావాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించినప్పటికీ ఆదనంగా లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక ఫంక్షన్ హాల్ నిర్మాణం చేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించినప్పటికీ చిన్నవాటికి లక్ష, పెద్ద వాటికి రెట్టింపు డబ్బులు వసూలు చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నాక భూమి విలువ నుబట్టి తహసీల్ కార్యాలయంలోని బ్రోకర్లు ముంకుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆ పని పూర్తి అయితేనే అక్కడ రిజిస్ట్రేషన్ అవుతుంది. లేకపోతే ఏదో రకంగా కొర్రీలు పెట్టి ఆపేస్తున్నారు. పెద్ద రైతులు ఎంత లేదన్న రూ.50 వేల నుంచి లక్ష వరకు చెల్లిస్తున్నారు. చిన్న రైతుల నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇవి గాకుండా డాక్యుమెంట్‌కు ఒక్కదానికి రూ.1,000 నుంచి రెండు వేల వరకు వసులు చేస్తున్నారు. మరి కొంతమంది ఆఫీసుకు ఫర్నిచర్ కావాలని అడుగుతున్నారు. వారసత్వం, పొతి వాటికి కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. వేలల్లో జీతాలు తీసుకునే ఉద్యోగులు ఇలా బరితెగించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్‌లో ఏకంగా ఫేక్ రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో గతంలో నలుగురు, ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్‌తో సహా నలుగురుతో పాటు మొత్తం 9 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఆర్డీవో కార్యాలయాల్లో దాడులు జరగడంతో బ్రోకర్ల షటర్లు క్లోజ్ చేసుకొని గోవా టూర్‌కు వెళ్లారు.

సిద్దిపేట తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న రైతులు

నేరుగా వెళ్తే పనికాదు!

సిద్దిపేట, మే 31: సిద్దిపేట నియోజకవర్గంలోని తహసీల్ కార్యాయాల్లో పనికావాలంటే పైరవీకారులు ఆశ్రయించనిదే కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు తహసీల్ కార్యాలయాల్లో వివిధ సమస్యలపై రైతులు, ప్రజలు నేరుగా వెళ్తే ఫైళ్లు ముందుకు కదలడం లేదు. పని కావాలంటే ఎవరో ఒకరు మధ్యవర్తిగా వెళ్లి చేయించక తప్పని పరిస్థితులు ఉన్నాయి. భూముల రేట్లు పెరిగిపోవడం భూ రికార్డుల్లో సవరణలు, ఇతర భూసంబంధమైన పనులు సకాలంలో జరగక రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని కార్యాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పైరవీకారుల ద్వారా వస్తేనే అధికారులు వేగంగా పనులు చేస్తున్నారని, తాము నేరుగా వెళ్తే పనులు కావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

డాక్యుమెంట్‌కు రూ.1000 చెల్లించాల్సిందే..

- చేర్యాల తహసీల్ కార్యాలయంలో పెరిగిపోతున్న అవినీతి

చేర్యాల, మే 31 : సిద్దిపేట జిల్లా చేర్యాల తహసీల్ కార్యాలయంలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతున్నది. ఒకప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్లు అయ్యేవి. అనంతరం తహసీల్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ డ్యాకుమెంట్స్‌తో మ్యుటేషన్ అయ్యి రికార్డులకు భూములు ఎక్కేవి. ధరణి పోర్టల్ ఏర్పాటు అనంతరం వ్యవసాయ భూములు మొత్తం తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ అవుతుండడంతో తహసీల్ అధికారులు, సిబ్బందికి రోజువారీగా డబ్బులు ముడుతున్నాయి. స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్లకు వచ్చిన రైతు నుంచి కార్యాలయంలో డబ్బులు వసూలు చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని అధికారులు నియమిస్తున్నారు. సదరు సిబ్బంది రిజిస్ట్రేషన్స్‌కు వచ్చిన రైతుల నుంచి రూ.1,000 నుంచి 2,000 వరకు డ్యాకుమెంట్ వారీగా వసూలు చేస్తున్నారు. వారసత్వంగా వచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసే విషయంలో అధికారులు ఎకరా విలువను బట్టి డబ్బులు మాట్లాడుకొని పనులు చేస్తున్నారు. ల్యాండ్ కన్వర్షన్‌లో ప్రభుత్వానికి చెల్లించే ఫీజు రూ.20వేలు ఉంటే అధికారులు ల్యాండ్ కన్వర్షన్ చేసుకున్న వ్యక్తుల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే అనేక కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై చేర్యాల తహసీల్దార్, ఆర్ఐని వివరణ కోరేందుకు 'నమస్తే తెలంగాణ' తహసీల్ కార్యాలయానికి వెళ్లేగా ఎవరూ అందుబాటులో లేరు.

చేర్యాల తహసీల్ కార్యాలయం

గజ్వేల్ తహసీల్ కార్యాలయం

గజ్వేల్ 'తహసీల్'లో పైరవీకారులదే పైచేయి

గజ్వేల్, మే 31: సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్ కార్యాలయంలో డబ్బులు ముట్టనిదే ఏపని కావడం లేదు. భూ సమస్యలపై రైతులు తహసీల్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పనులు కావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తహసీల్ కార్యాలయంలో పైరవీకారులను ఆశ్రయిస్తేనే పనులు జరిగిపోతున్నాయి. పైరవీకారులు సమస్యను బట్టి డబ్బులు తీసుకొని అధికారులతో పనులు చేయిస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా రూ.30 నుంచి రూ.40 లక్షలకు ఎకరా భూమి ధర పలుకుతున్నది. వేల సంఖ్యలో భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్ కార్యాలయాల్లో చేతులు తడపనిదే పనులు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

వైభవంగా రంగనాథ స్వామి రథోత్సవం

- హాజరైన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, మే 31: అందోల్‌లోని భూనీలా రంగనాథస్వామి ఆలయంలో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని నిర్వహించగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. మంత్రిని ఆలయ నిర్వాహకులు, పురోహితులు ఆలయమర్యాదలతో ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎంతో పూరాతన ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పించి పూర్వ వైభవం తీసుకువస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కొన్ని దశాబ్దాల క్రితం నిలిచిపోయిన రథోత్సవాన్ని మళ్లీ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్టేట్ మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయం రథోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

పత్తి విత్తన ప్యాకెట్లు సీజ్

ములుగు, మే 31: అనుమతి లేకుండా పత్తి విత్తనాలను ప్యాకింగ్ చేస్తున్నట్లు గుర్తించి, వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రగతి తెలిపారు. ఆమె కథనం ప్రకారం... మండల కేంద్రం ములుగులోని భారతి బయో జెనిటిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అనుమతులు లేకుండా వివిధ కంపెనీల పేర్లతో పత్తి విత్తనాలు ప్యాకింగ్ చేస్తున్నట్లుగా గుర్తించి శుక్రవారం రాత్రి ఏడీఏ అనిల్‌కుమార్, ఎస్సై విజయ్‌కుమార్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించి పత్తి విత్తనాలను, ప్యాకింగ్‌కు ఉపయోగించే 101 ఖాళీ ప్యాకెట్లను, సుమారు 8కిలోల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని, కంపెనీ యజమాని కందికట్ల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏవో ప్రగతి తెలిపారు.

సిద్దిపేట జిల్లా ములుగులో స్వాధీనం చేసుకున్న విత్తనాలను చూపుతున్న అధికారులు

మద్యం మత్తులో దాడి

- నలుగురు యువకుల రిమాండ్
- సిద్దిపేట జిల్లా దుబ్బాకలో వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు

దుబ్బాక, మే 31: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేసి, గాయపర్చిన నలుగురు యువకులపై దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో సిద్దిపేట ఏసీపీ మధు తెలియజేశారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన రశీద్, అతడి మిత్రుడు హైదరాబాద్‌కు చెందిన విష్ణుతో కలిసి గురువారం కారులో దుబ్బాకకు వస్తున్నారు. దుబ్బాక పట్టణంలో(దుబ్బాక-లచ్చపేట రోడ్డులో)ని గంగమ్మ ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో కారులో దుబ్బాకకు చెందిన దేవుని రమణ, పర్స భాస్కర్, రాచమల్లు వినోద్ అలియస్ బొమ్మ, ఆలేటి శరత్ వారి కారును అడ్డగించారు. మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు రశీద్, విష్ణులతో గొడవ పడ్డారు. అంతటితో అగకుండా వారిపై బీరు సీసాలతో విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. వారి కారును ధ్వంసం చేశారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర గాయాలపాలైన రశీద్, విష్ణులను దుబ్బాకలోని వంద పడకల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి సిద్దిపేట జిల్లా దవాఖానకు తరలించారు. ఈ విషయంపై రషీద్ భార్య నస్రీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాత కక్షలతోనే ఆ ఇద్దరు యువకులపై నిందితులైన నలుగురు యువకులు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిపై 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగారాజు, పోలీసులు హరిసింగ్, రాంజీ, ఆశోక్, గణేశ్ తదితరులున్నారు.

దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు, పక్కన దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగరాజు

అధ్వానంగా పిల్లల పార్కు

- ఆటలకు దూరంగా చిన్నారులు
- గజ్వేల్ హౌసింగ్ బోర్డు పార్కులో విరిగిన ఆట వస్తువులు
- పనిచేయని జిమ్ పరికరాలు

గజ్వేల్, మే 31: చిన్నారులు ఆడుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్‌లోని హౌసింగ్‌బోర్డు మైదానంలో ఏర్పాటు చేసిన పార్కు నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు ఎక్కడికక్కడ విరిగిపోవడంతో చిన్నారులు ఆటలకు దూరం అవుతున్నారు. విరిగిన జారుడు బండలు, ఊయ్యాలలు, పార్కు చెత్తతో దర్శనమిస్తున్నది. జిమ్‌పై ఏర్పాటు చేసిన మ్యాట్‌లు దెబ్బతిన్నాయి. అందులోని కొన్ని పరికరాలు వాడకంలో లేకుండాపోయాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చిన్నపిల్లల పార్కు సంరక్షణ బాధ్యతను మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ప్రాతినిధ్యం వహిస్తున్న 18వ వార్డులోనే ఈ పార్కు ఉండడం విశేషం.

విరిగిన జారుడు బండ, ఆట వస్తువులు

మ్యాట్ లేకుండా ఉన్న జిమ్, అందులో పనిచేయని పరికరాలు

చిన్నారులు ఆడేందుకు వీలులేకుండా ఉన్న ఆట వస్తువులు

మరమ్మతులు చేపడుతాం..

గజ్వేల్ హౌసింగ్ బోర్డు మైదానంలోని చిన్న పిల్లల పార్కులో త్వరలోనే మరమ్మతులు చేపడుతాం. ఇప్పటికే టీఎఫ్ఐడీసీ వారికి రూ.2 కోట్లతో పార్కును అధునీకరించేందుకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. అందరి సౌకర్యార్థం త్వరలోనే అన్ని హంగులతో పార్కును అందుబాటులోకి తీసుకొస్తాం.

–ఎన్సీ రాజమౌళి, మున్సిపల్ చైర్మన్, గజ్వేల్